క్లుప్తంగా

నేత్ర శస్త్రచికిత్సలకు 20 మంది ఎంపిక



శస్త్ర చికిత్సకు తరలిస్తున్న రోగులు

ఎస్.రాయవరం: శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సర్వసిద్ధి పీహెచ్‌సీలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 65 మంది రోగులకు ఆప్తాలమిస్టు బొండా వెంకటరావు కంటి పరీక్షలు చేశారు. వీరిలో 20 మందిని కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. 17 మందిని విశాఖ కంటి ఆస్పత్రికి శస్త్ర చికిత్స నిమిత్తం తరలిస్తున్నట్టు చెప్పారు. ఈ శిబిరంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు నేత్ర వైద్య శిబిరం

ఎస్.రాయవరం: శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక గ్రామ సచివాలయం వద్ద బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు వైద్య నిపుణుడు బి.వెంకటరావు తెలిపారు. శంకర్ ఫౌండేషన్ నుంచి 8 మంది వైద్య నిపుణులు వస్తారని, అన్ని రకాల కంటి పరీక్షలు చేస్తారన్నారు.

భూసారాన్ని కాపాడుకోవాలి



మాట్లాడుతున్న ఏవో పాలిమేర మోహన్‌రావు

యలమంచిలి రూరల్: పంటలకు ప్రాణప్రదమైన భూమిపై పార వర్షపు నీటితో కొట్టుకుపోకుండా సాగు చేసే పీఎండీఎస్ పద్ధతి వల్ల అనేక ప్రయోజనాలున్నాయని ఏవో పాలిమేర మోహనరావు తెలిపారు. మండలంలోని లైను కొత్తూరు మండల మహిళా సమాఖ్య భవనంలో వార్షిక ప్రణాళికలో భాగంగా మంగళవారం మండల స్థాయి వ్యవసాయ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై మహిళా రైతులకు అవగాహన కల్పించారు. ప్రీ మాన్‌సూన్ డ్రై సీడింగ్ (పీఎండీఎస్) పద్ధతి వర్షాకాలానికి ముందే భూమిలో తడి తక్కువగా ఉన్నపుడు విత్తనాలు వేసే పద్ధతిగా ఆయన వివరించారు. దీనివల్ల మట్టి సారవంతమౌతుందన్నారు. ఏపీసీఎన్ఎఫ్ ముఖ్యమైన లక్ష్యాలలో పీఎండీఎస్ ఒకటని చెప్పారు. కేపీపీ ప్రణాళికల గురించి చర్చించారు. మండలంలో లక్కవరం గ్రామాన్ని వంద శాతం బయో విలేజ్‌గా ఎంపిక చేశామన్నారు. సహజ వ్యవసాయం ద్వారా ఆరోగ్యకర ఆహార ఉత్పత్తులు అందుబాటులోకి తేవడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం ఎస్తేరు రాణి, ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారి వర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు ప్రజలు

అచ్యుతాపురం రూరల్: ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమవుతోందని సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీపీఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మండలంలో అనేక సమస్యలు పరిష్కారం కావడం లేదని గుర్తించామని అచ్యుతాపురం కన్వీనర్ రొంగలి రాము తెలిపారు. మండలంలో చాలా గ్రామాల్లో ప్రజలు మంచినీటి సమస్య ఎదుర్కొంటున్నారన్నారు. ఉపాధి లేక పూట గడవడానికి ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రభుత్వం నిత్యావసర సరుకుల ధరలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. అనేక సమస్యలపై తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ



శిక్షణలో అంగన్‌వాడీ కార్యకర్తలు

అచ్యుతాపురం రూరల్: పోషణ భీ-పఢాయి భీ కార్యక్రమంలో భాగంగా రెండో బ్యాచ్ అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ తరగతులు మంగళవారం పూడిమడక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు సంవత్సరాలలోపు పిల్లల సంరక్షణపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ నాగూర్, పైడికొండ అవగాహన కల్పించారు. మూడు సంవత్సరాలు దాటిన చిన్నారులకు అక్షరాలను గుర్తించడం, చదివించడంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో బీపీసీ డేవిడ్, డీపీసీ రాజు, సీడీపీవో ఇందిరాదేవి, ప్రాజెక్టు డైరెక్టరు అనంతలక్ష్మి పాల్గొన్నారు.

సకల దేవతల నిలయం పట్టాలమ్మతల్లి ఆలయం



పట్టాలమ్మతల్లి

సకల దేవతలు కొలువుదీరితే..
దేవతలంతా ఒకేచోట కొలువుదీరి దర్శనమిస్తే అంతకంటే అద్భుతం ఏం ఉంటుంది. ఇదేరీతిన పట్టాలమ్మతల్లి ఆలయంలో సకల దేవతామూర్తులు ఒకేచోట కొలువుతీరి భక్తులకు ఓ గొప్ప అనుభూతిని ఇస్తున్నారు. పట్టాలమ్మతల్లి ప్రధాన ఆలయం కాగా, చుట్టూ విశాలమైన స్థలంలో నవదుర్గలు, లక్ష్మీగణపతులు, అష్టలక్ష్ములు, నవగ్రహాలు, పంచముఖ ఆంజనేయుడు, అంకాలమ్మ, శివుడు, షణ్ముఖుడు, గోపాలుడు, గోవిందుడు, గోమాతలు ఇలా ఓ అద్భుత ఆధ్యాత్మిక ప్రపంచంలోకి తీసుకెళ్లిన భావన కలుగుతోంది.



నిత్యాన్నదానంలో ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

నిత్యాన్నదానం..
సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఆకలితో ఇబ్బంది పడకూడదనే భావనతో ధర్మకర్త రమణ నిత్యాన్నదాన పథకాన్ని ప్రవేశపెట్టారు. దాతల సహాయ సహకారాలతో నిత్యం మధ్యాహ్నం భోజనం పెట్టేలా అన్నపూర్ణ అన్నప్రసాద నిలయాన్ని నిర్మించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తొలుత పట్టాలమ్మతల్లిని దర్శించుకుని అనంతరం మిగతా దేవతామూర్తుల విగ్రహాలను మనసారా చూసి పరవశించి కాసేపు విశ్రాంతి తీసుకున్నాక మధ్యాహ్నం భోజనం ప్రసాదంగా స్వీకరించి వెళ్తుంటారు.



ఆకట్టుకుంటున్న శివయ్య

ఆధ్యాత్మిక కేంద్రంగా పాములవాక
ఒకేచోట కొలువైన పలు దేవతామూర్తుల విగ్రహాలు
ఏటా పెరుగుతున్న భక్తుల తాకిడి



పవళించిన గోవిందుడు



శేషతల్పంపై లక్ష్మీ సమేతంగా శ్రీమహావిష్ణువు



సామూహిక వ్రతాలు చేస్తున్న భక్తులు(ఫైల్)

కోటవురట్ల: ఆధ్యాత్మికతతో ప్రశాంతత.. ప్రస్తుత రోజుల్లో ప్రతి ఒక్కరూ కోరుకుంటున్న వాతావరణం ఆలయాల సందర్శనతో వస్తోంది. కుటుంబ సమేతంగా ఆలయానికి వెళ్లి కాసేపు ప్రశాంతంగా గడిపితే నూతనోత్తేజం వస్తోంది. బిజీగా మారిన పరిస్థితులతో యాంత్రిక జీవనానికి అలవాటు పడిన వారికి మానసిక ఒత్తిడి తొలగి పాజిటివ్ వైబ్రేషన్స్‌తో రీచార్జ్ అవుతున్నారు. దాంతో పల్లె, పట్టణాలలో ఆలయాలను విశేషంగా అభివృద్ధి చేస్తున్నారు. కొన్ని ప్రాంతాలు ఆధ్యాత్మిక కేంద్రాలుగా ప్రసిద్ధి చెందుతున్నాయి. పాములవాక శివారున వేంచేసిన పట్టాలమ్మతల్లి ఆలయం చెంతన పలు దేవతామూర్తులను చేర్చుకోవడంతో గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా మారింది. ఈ ఆలయాన్ని ఎస్.వి.రమణ అనే ధర్మకర్త 2005లో గ్రామానికి దూరంగా ప్రశాంత వాతావరణంలో నిర్మించారు. అప్పటి నుంచి పాములవాక గ్రామస్తులు మూడేళ్లకోసారి గ్రామంలో పట్టాలమ్మతల్లి పండుగను వైభవంగా జరుపుకుంటారు. ఈ ఉత్సవాలను తొమ్మిది రోజుల పాటు భక్తి శ్రద్ధలతో జరుపుతారు. పట్టాలమ్మతల్లి ఆలయంలో పలు దేవతామూర్తుల విగ్రహాలు చేరడంతో ప్రస్తుతం నవదుర్గల పట్టాలమ్మతల్లి ఆలయంగా పేరొందింది.

పేదలకు ఉచితంగా కల్యాణాలు..
సర్వ దేవతామూర్తుల సమక్షంలో వివాహం చేసుకుంటే ఆ జంట జీవితాంతం సుఖసంతోషాలతో ఉంటారని ఈ ప్రాంత ప్రజల నమ్మకం. దాంతో పలువురు ఇక్కడ వివాహాది శుభకార్యాలు చేసుకుంటారు. భక్తుల తాకిడిని దృష్టిలో పెట్టుకుని కల్యాణ మండపాన్ని నిర్మించారు. నామమాత్రపు రుసుంతో కల్యాణ మండపాన్ని ఇస్తుండగా, పేదలకు ఉచితంగా అందిస్తున్నారు. పలువురు పేదలకు ఉచితంగా కల్యాణాన్ని చేస్తూ ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నారు. పేద జంటలకు కావలసిన మంగళ సూత్రాలు, ఇతర సామగ్రిని ఆలయంలోనే సమకూరుస్తున్నారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా..
ఆధ్యాత్మికంగానే కాకుండా పలువురు ప్రశాంతంగా గడిపేందుకు పట్టాలమ్మతల్లి ఆలయం వద్ద గడుపుతుంటారు. సుదూర ప్రాంతాల నుంచి బంధుమిత్రులు కలిసి వచ్చి ఆలయంలో కాసేపు గడిపి వెళ్తుంటారు. ఇక ప్రత్యేక పండుగ రోజుల్లో ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. ఏడాది పొడవునా నిత్యపూజలు, నిత్యాన్నదానంతో ఆలయం ప్రత్యేక కేంద్రంగా మారింది.

దాతల సాయంతో అభివృద్ధి..



పట్టాలమ్మతల్లి మహిమతో ఈ ప్రాంతం విశిష్టతను పొందింది. జిల్లాలు దాటి భక్తులు వస్తుంటారు. సమస్త దేవతలు ఒకేచోట ఉంటే, ఎలా అన్న ఆలోచనతో ఆకట్టుకునేలా సమస్త దేవతామూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేశాం. భక్తులకు ఇబ్బంది కలగకుండా నిత్యాన్నదానం చేస్తున్నాం. ఇక్కడ కల్యాణ మండపంలో 60 పేద జంటలకు మంగళసూత్రాలు, వస్త్రాలు అన్నీ సమకూర్చి వివాహాలు చేశాం. ఇక్కడకు వచ్చే భక్తులు అలౌకిక ఆనందం పొందేలా ఆధ్యాత్మిక వాతావరణాన్ని కల్పించాలన్నదే నా ఆశయం.
– ఎస్.వి.రమణ, ఆలయ ధర్మకర్త, పట్టాలమ్మతల్లి ఆలయం

ఘనంగా గ్రామదేవతల పండగలు



పరదేశమ్మతల్లిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్



గవర్ల అనకాపల్లిలో ఘటాల ఊరేగింపులో భక్తులు

మునగపాక: మండలంలో గవర్ల అనకాపల్లి, నారాయుడుపాలెం, మునగపాక గ్రామాల్లో మంగళవారం పరదేశమ్మ తల్లి పండగలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి ఆయా ప్రాంతాల్లోని అమ్మవార్లను భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగు చర్యలు తీసుకున్నారు. గవర్ల అనకాపల్లిలో ఘటాల ఊరేగింపు నిర్వహించారు. డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపు జరిగింది. మునగపాకలో పరదేశమ్మ తల్లిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, సర్పంచ్ దిమ్మల అప్పారావు, పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు తదితరులు దర్శించుకొని పూజలు చేశారు. ఈ పండగను సర్పంచ్ అప్పారావు స్థానికంగా ఊయల ఊగి ప్రారంభించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ వేగి కృష్ణ ఆధ్వర్యంలో పండగను ఘనంగా నిర్వహించారు.

ఇమిరీస్ పరిశ్రమ సౌజన్యంతో 50 బెంచీల వితరణ



ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో ఇమిరీస్ సిబ్బంది



పూడిమడక పాఠశాల విద్యార్థులతో ఇమిరీస్ సిబ్బంది

అచ్యుతాపురం రూరల్: ఇమిరీస్ పరిశ్రమ సీఎస్ఆర్ నిధులతో స్థానిక ఇంటిగ్రేటెడ్ ఆశ్రమ పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులకు ఎల్రక్టానిక్ మూవింగ్ వీల్ చైర్స్ అందజేశారు. ఇమిరీస్ ఇండియా, ట్రీఐ సంయుక్తంగా మంగళవారం ఇంటిగ్రేటెడ్ ఆశ్రమ పాఠశాలతోపాటు పూడిమడక జెడ్పీ ఉన్నత పాఠశాలకు 50 బెంచీలు వితరణగా అందజేశారు. ఇమిరీస్ పరిశ్రమ హబ్ డైరెక్టర్ డర్క్ వన్ డెన్ హీవర్, ట్రీఐ ఫౌండేషన్ సీఈవో తన్వీర్ మాందర్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి విద్యనభ్యసించి ఉత్తమ శిఖరాలు అధిరోహించాలన్నారు. ఇండియా చైర్మన్ భోజ్‌వాని భగవాన్ దాస్, ప్లాంట్ మేనేజర్ గోపాల రఘుకుమార్ నాలం, ఇ క్యూబ్ మేనేజర్ నాగేంద్రరావు, హెచ్ఆర్ మేనేజర్ త్రినాథరావు, హెచ్ఆర్ మేనేజర్ మృనీల, ఇమిరీస్ సిబ్బంది, ఇంటిగ్రేటెడ్ ఆశ్రమ పాఠశాల వ్యవస్థాపకుడు పీఎస్‌టీ పట్నాయక్ పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి



మాట్లాడుతున్న ఏవో ఆదినారాయణ



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు

పాయకరావుపేట: మండలంలో పెదరాంభద్రపురంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా క్షేత్ర సందర్శన, రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏవో పి.ఆదినారాయణ మాట్లాడుతూ ఏపీ ఫార్మర్ రిజిస్ట్రీ, రాయితీపై యంత్ర పరికరాలు గురించి రైతులకు అవగాహన కల్పించారు. మద్దతు ధరపై ధాన్యం అమ్ముకోవాలన్నారు. రైతులు సమీప రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి ఏపీ ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలన్నారు. పంటలకు సోకే తెగుళ్లకు ఎన్‌పీఎస్ఎస్ యాప్ ద్వారా ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించారు. పెదరాంభద్రపురం గ్రామ వ్యవసాయ సహాయకురాలు జి.వందన, వ్యవసాయ సహాయకురాలు ఆర్.సాధన, సర్పంచ్ పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన



స్క్రీన్‌పై తిలకిస్తున్న బాలికలు

పాయకరావుపేట: పట్టణంలో బాలికల వసతి గృహల్లో విద్యార్థినులకు సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించామని సీఐ జి.అప్పన్న తెలిపారు. వసతి గృహల్లో డిజిటల్ స్క్రీన్ ద్వారా విజువల్స్, వీడియో, ఆడియో ద్వారా డ్రగ్స్ అవేర్నెస్, క్రైమ్ ఎగెనిస్ట్ ఉమెన్, సైబర్ క్రైమ్ మొదలగు విషయాలపై చూపించామన్నారు.

పెన్షనర్ల అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



సూర్యకుమారికి పేటర్నిటీ చెక్కును అందిస్తున్న పెన్షనర్ల అసోసియేషన్

పాయకరావుపేట: పెన్షనర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు గెద్దం గాంధీ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ సమావేశంలో పెన్షనర్ల సమస్యలపై చర్చించామన్నారు. పెన్షనర్లకు పీఎఫ్, గ్రాట్యుటీ, సరెండర్ లీవ్, వన్ కేష్‌మెంట్ బిల్లు సొమ్ము చెల్లించాలన్నారు. ఇహెచ్ఎస్ కార్డుపై అర్హులందరికీ అన్ని వ్యాధులకు ఉచిత వైద్య సేవలు అందించాలన్నారు. అనంతరం పెన్షనర్ ఆర్వీ రమణయ్య భార్య సూర్యకుమారికి పెన్షనర్ల సంక్షేమ నిధి నుంచి రూ. 75 వేల చెక్కు అందించినట్లు తెలిపారు.

ప్రతి ఒక్కరూ దైవచింతన అలవరచుకోవాలి



ప్రకాషరావు మాస్టారును సత్కరిస్తున్న పార్టీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు

మునగపాక: ప్రతి ఒక్కరూ దైవచింతన అలవాటు చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు కోరారు. స్థానిక సాంబశివుని ఆలయ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం రాత్రి పూర్వపు ఆలయ చైర్మన్ అలంక ప్రకాషరావు మాస్టారుతోపాటు పలువురు పెద్దలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అచ్చియ్యనాయుడు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధితో పాటు గతంలో నిర్వహించిన ఉత్సవాలు విజయవంతంలో మాస్టారు ఎంతో కృషి చేశారన్నారు. అటువంటి వారిని నేటితరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆలయ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్దలు డాక్టర్ బద్దెం సూర్యనారాయణ, టెక్కలి పరశురామ్, మళ్ల సంజీవరావు, ఆడారి లక్ష్మణరావు, ఆడారి కాశీబాబు, పెంటకోట సత్యనారాయణ, సూరిశెట్టి అప్పలనాయుడు, మావూరి రాజు, మావూరి శ్రీనివాసరావు, కాశీ పాల్గొన్నారు.

ఒకేసారి పన్ను చెల్లిస్తే 50 శాతం వడ్డీ రాయితీ

యలమంచిలి రూరల్: పురపాలక సంఘం పరిధిలో ఆస్తి పన్ను బకాయిదారులకు ప్రభుత్వం ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను ఇంకా చెల్లించని వారు ఒకేసారి బకాయిలు చెల్లిస్తే 50 శాతం వడ్డీ రాయితీ ఇవ్వనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు తెలిపారు. ఈ అవకాశం ఈ నెల 31వ తేదీ వరకు ఉంటుందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే పన్ను మొత్తం చెల్లించిన వారికి 50 శాతం వడ్డీ రాయితీ వర్తిస్తుందన్నారు. అలాంటి వారికి వచ్చే ఆర్థిక సంవత్సరంలో చెల్లించాల్సిన పన్ను మొత్తంలో 50 శాతం వడ్డీ రాయితీ మొత్తానికి మినహాయింపు ఉంటుందని తెలిపారు. పన్ను వసూళ్ల కోసం సెలవు దినాల్లోనూ పురపాలక సంఘం కార్యాలయంలో ప్రత్యేక కౌంటరు పనిచేస్తుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎస్.రాయవరం: కొరుప్రోలు సబ్ స్టేషన్ పెదగుమ్ములూరు ఎస్ఎస్ ఫీడర్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. భీమవరం, గోకులపాడు గ్రామాలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

మహారాజశ్రీ యలమంచిలి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P 3/2018, O.S. 28/2016
D.H.R.: యల్లపు శేషుబాబు
J.D.R.: కాళ్ల సత్యన్నారాయణ

బహిరంగ వేలం ప్రకటన

పై నంబరు అమలు నందు ఈ క్రింది షెడ్యూల్ ఆస్తి పై కోర్టులో **తేది: 10-04-2025 న ఉదయం 10.30 ని॥ల నుండి సాయంత్రం 5 గం॥లలోపు** బహిరంగ వేలం జరుపబడుటకుగాను శ్రీ కోర్టు వారు నిర్ణయించిరి. కావున వలయువారు వేలంలో పాల్గొని పాడుకొనవచ్చును. ఈ వేలం ఆస్తి విషయమై ఎటువంటి సమాచారం అయిన శ్రీ కోర్టువారి నజారత్ నందుగాని, లాయరు గార్ని గాని అడిగి తెలుసుకొనవచ్చును.

షెడ్యూలు

విశాఖపట్నం జిల్లా, యలమంచిలి మండలం, యలమంచిలి సబ్॥రి॥ కొక్కిరాపల్లి గ్రామ పంచాయతీలో చేరిన వల్లం భూమి సర్వే నం. 145-3లో గల యం॥ 19-54 సెంట్లు భూమిలో గల యం॥ 0-20 సెంట్లు లేక హె॥ 0-080 ఆస్తికి **హద్దులు: తూర్పు:** వదాల సోమరాజు గారి భూమి, **దక్షిణం:** కాళ్ల సత్యన్నారాయణ భూమి (JDR), **పడమర:** అదబాల పోతురాజు గారి భూమి, **ఉత్తరం:** కాళ్ల సత్యన్నారాయణ గారి భూమి (JDR).

DHR Value	: 5,00,000/-
Ameen Value	: 10,00,000/-
Market Value	: 2,40,000/-

యల్లపు నాగేశ్వరరావు,
అడ్వకేటు, యలమంచిలి
యలమంచిలి
తేది: 22-03-2025   సెల్: **9553383837**

వైద్య సేవలు ప్రారంభించాలని నిరసన



నిరసన తెలియజేస్తున్న సీఐటీయూ నాయకులు

యలమంచిలి రూరల్: పట్టణ ప్రధాన రహదారి పక్కనున్న పాత ప్రభుత్వాస్పత్రి భవనంలో వైద్యసేవలు ప్రారంభించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మహిళలు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఏడాదిగా పాత ప్రభుత్వాస్పత్రి భవనం నిరుపయోగంగా ఉందని, ఇక్కడ అత్యవసర విభాగంతో పాటు, ప్రసూతి సేవలందిస్తే, రోగులకు ప్రయోజనం చేకూరుతుందని తహసీల్దార్ కె. వరహాలుకు వినతిపత్రం ఇచ్చారు. చుట్టు పక్కల అన్ని మండలాల నుంచి వచ్చే ప్రజలందరికీ భవనం అందుబాటులో ఉందని సీఐటీయూ యలమంచిలి మండల కార్యదర్శి చింతకాయల శివాజీ తెలిపారు. ఓపీ సేవలతోపాటు మిగిలిన సేవలను ఇక్కడ ప్రారంభించాలని, లేకపోతే భవనం పూర్తిగా శిథిలమై ప్రజాధనం వృథా అవుతుందన్నారు. ప్రస్తుతం ఆస్పత్రి నూతన భవనం తులసీనగర్‌లో ఉండటం వల్ల అక్కడికి వెళ్లడానికి రవాణా సౌకర్యం లేక అత్యవసర సమయాల్లో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సీఐటీయూ నాయకులు జానకి, నూకరత్నం, లక్ష్మి పాల్గొన్నారు.